షగుఫ్తా పర్వీన్‌కు పీహెచ్‌డీ



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థినికి సోమవారం పీహెచ్‌డీని ప్రకటించారు. ఉమెన్ స్టడీస్ విభాగంలో పర్వీన్ 'ది చాలెంజెస్ ఆఫ్ హోమ్ బేస్డ్ ఉమెన్ వర్కర్స్–ఎ క్రిటికల్ స్టడీ' అనే అంశంపై ఉమెన్ ఎడ్యుకేషన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పర్వీన్ కమర్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. దీన్ని పరిశీలించి పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు.

సురేష్ కుమార్‌కు డాక్టరేట్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి సురేష్ కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఉస్మానియా యూనివర్సిటీ లోని భౌతిక శాస్త్ర విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ సాధన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్ ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో జరిగిన పరిశోధనలో స్ట్రక్చరల్ ఆప్టికల్ మేగ్నెటిక్, డై ఎలక్ట్రిక్ ప్రాపర్టీస్ ఆఫ్ ఎర్త్ పై పరిశోధనా పత్రంను సమర్పించారు. ఈ మేరకు ఆయన్ని ప్రిన్సిపాల్, అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ప్రవీణ, డాక్టర్ యోగిబాబు, డాక్టర్ పూనంకుమారి, డాక్టర్ విజయలక్ష్మి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



సాయిబాబాను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నేతాజీనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు కనులపండువగా సోమవారం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు యు.శేఖర్ సాగర్, కమిటీ ప్రతినిధులు సాయిబాబాను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

మాదాపూర్: కారు బోల్తాపడిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారు జామున 4.30 గంటలకు సైబర్ టవర్స్ నుంచి మాదాపూర్ పోలీస్‌స్టేషన్ వైపు వెళుతున్న కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. కారులో ముగ్గురు వ్యక్తులు ఉన్నారని సమాచారం. మద్యం మత్తులో ప్రమాదం జరిగిఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు.

26 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 26 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 21 మందికి రూ. 2 వేలు, నలుగురికి రూ. 1500, మరోకరికి వెయ్యి చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

మియాపూర్: యువతి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మాణిక్యం తెలిపిన వివరాల ప్రకారం...మియాపూర్ దీప్తిశ్రీనగర్ కాలనీకి చెందిన అనిల్‌దాస్, పర్బాతిదాస్ దంపతులు కూలీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు.వీరికి కూతురు రాధారాణీ దాస్(20) ఉంది. జనవరి 1వ తేదీ వీరు కూలీ పనికి వెళ్లారు. కూతురు రాధ ఇంటివద్దే ఉంది. సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి వచ్చేసరికి కూతురు రాధారాణీ దాస్ కనిపించలేదు. చుట్టుపక్కల స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆందోళన చెందిన పర్బాతిదాస్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్న యువకుడి అరెస్టు

బంజారాహిల్స్: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డునంబర్–12లోని శ్రీరామ్‌నగర్ బస్తీకి చెందిన మహ్మద్ సాబేర్ (30) కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. ఆదివారం వెబ్ అప్లికేషన్‌లో గోల్డ్ 365.కామ్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతుండగా సమాచారం అందుకున్న బంజారాహిల్స్ ఎస్ఐ ఎండీ.యాసిన్ అలీ నిందితుడిని పట్టుకున్నాడు. నిందితుడి నుంచి ఫోన్‌తో పాటు ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొత్త రోడ్డు.. తగ్గనున్న దూరభారం

గంగారం- అపర్ణ వరకు రోడ్డు నిర్మాణం



పెద్ద చెరువు కట్ట పక్కన ఉన్న రోడ్డు ఇదే

చందానగర్: గంగారం– అపర్ణ వరకు కొత్త రోడ్డు వేయనుండడంతో సమీప కాలనీవాసుల కష్టాలు తీరనున్నాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గం ఐటీ హబ్ కావడం..రోజు రోజుకు విస్తరిస్తున్న కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు రావడంతో రోడ్లు ఇతర మౌలిక వసతులు కల్పించడంలో జీహెచ్‌ఎంసీ ముందుకు వెళ్తుంది. కాగా చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం చెరువు వెనక ఉన్న అపర్ణ కమ్యూనిటీలు, ఇతర అపార్ట్‌మెంట్లవాసులు కెఎస్‌ఆర్ కాలనీ, పీజేఆర్ రోడ్డు మీదుగా గంగారం జాతీయ రహదారికి చేరుకోవాల్సి ఉంది. సుమారు 4 కిలోమీటర్లు రావాలి. ఇరుకు రోడ్డుతో ఉదయం సాయంత్రం వేళ ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. దీంతో గేటెడ్ కమ్యూనిటీవాసులు సమస్య గురించి పలుమార్లు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు వివరించారు. దీంతో అపర్ణ నుంచి గంగారం గుడి వరకు చెరువు కట్టమీద నుంచి రోడ్డు వేసేందుకు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. కానీ ఇరిగేషన్ అధికారులు చెరువుకట్టపై రోడ్డు వేయడానికి అనుమతులు ఇవ్వలేదు. చెరువు పక్క నుంచి రోడ్డు వేసుకోవచ్చని సూచించారు.

- అపర్ణహిల్ పార్కు, లేక్‌వ్యూలతో కలిసి సుమారు 2,750 కుటుంబాలు నివాసముంటున్నాయి.
- గంగారం చౌరస్తా నుంచి పీజేఆర్ కాలనీ, కెఎస్ ఆర్ లేఅవుట్ మీదుగా 30 అడుగుల రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.
- ఉదయం, సాయంత్రం సమయాలలో 4 కిలోమీటర్లు వెళ్లాలంటే గంట సమయం పడుతుండడంతో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజుల ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయ రోడ్డు వేయాలని కోరారు.

- 4 కిలోమీటర్లు తగ్గనున్న దూరం
- 14 కోట్లు.. 80 అడుగుల వెడల్పుతో
- తీరనున్న అపర్ణ కమ్యూనిటీవాసుల కష్టాలు



గంగారం పెద్ద చెరువు పక్కన ఉన్న ప్రహరీ గోడకు రోడ్డు విస్తరణకు మార్కింగ్ వేసిన దృశ్యం

నూతన రోడ్డుతో ట్రాఫిక్ కష్టాలు తీరతాయి



గంగారం నుంచి అపర్ణ టవర్స్ వరకు నూతన రోడ్డు నిర్మాణంతో ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఇప్పటి వరకు 4 కిలోమీటర్లు గంట పాటు ట్రాఫిక్‌లో ప్రయాణించాల్సి వచ్చేది. నూతన రోడ్డుతో ఒక కిలోమీటర్ దూరంలో జాతీయ రహదారి చేరుకోవచ్చు. త్వరతగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం.

– మంజుల రఘునాథ్‌రెడ్డి, కార్పొరేటర్, చందానగర్ డివిజన్

హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో రోడ్డు పనులు



హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో అపర్ణ కమ్యూనిటీస్– గంగారం జాతీయ రహదారికి నూతన రోడ్డు వేయనున్నారు. రోడ్డు నిర్మాణానికి తొమ్మిది ఆస్తులు అడ్డంకిగా ఉన్నాయి. త్వరలోనే చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి టీడీఆర్ అందించి ప్రాపర్టీస్‌ను స్వాధీనం చేసుకుంటాం.

– మోహన్‌రెడ్డి, ఉపకమిషనర్, చందానగర్ సర్కిల్– 21

- సంవత్సరాల నిరీక్షణ తరువాత ఎట్టకేలకు నూతన రోడ్డుకు అనుమతులు వచ్చాయి.
- గంగారం నుంచి అపర్ణ టవర్స్ వరకు నూతన రోడ్డు వేయడం వలన కేవలం ఒక కిలోమీటర్‌లో జాతీయ రహదారికి చేరుకోవచ్చు.
- గంగారం హనుమాన్ ఆలయం వెనక నుంచి సుమారు 80 అడుగుల రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.
- సుమారు రూ.14 కోట్లతో రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థ రోడ్డు నిర్మాణ పనులు దక్కించుకుంది.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



చందానగర్: హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 2.00 వరకు ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, యూత్ కాలనీ, వార్డు కార్యాలయం, గ్రీన్ బవార్చి ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- ఆదిత్యానగర్ ఫీడర్ పరిధిలో.. ఆదిత్యానగర్, ఎస్‌సీబి కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ప్రాంతాలలో..

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

- భిక్షపతి ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు కైలాష్‌నగర్, టెక్నో అపార్ట్‌మెంట్, జవహర్ కాలనీ రోడ్డు నెంబర్ 4,5,6, శ్రీదేవి థియేటర్ ఎదురుగా ఉన్న ఏరియాలలో ..

చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో.. ఆదిత్యా ఇంపీరియల్ హైట్స్, మార్తాండనగర్ ఫీడర్ల పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఆదిత్యా ఇంపీరియల్ హైట్స్, మార్తాండనగర్ పూర్తి ఏరియాలలో విద్యుత్ ఉండదని ఏఈ దీప్తి పేర్కొన్నారు.
- ఆదిత్యనగర్ ఫీటర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 నుంచి 2.00 గంటల వరకు ఆదిత్యనగర్, ఎస్‌సీబీ కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ఏరియాలలో విద్యుత్ నిలిపివేస్తున్నామన్నారు.

సిద్ధార్థ ఆస్పత్రిలో తనిఖీలు

- ఆపరేషన్ థియేటర్ సీజ్..దర్యాప్తు అనంతరం చర్యలు తీసుకుంటాం
- రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు



చందానగర్ : మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో సోమవారం మదీనాగూడలోని సిద్ధార్థ ఆస్పత్రిని తనిఖీ చేసినట్టు రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 12వ తేదీన కడప జిల్లాకు చెందిన సుహాసిని న్యూరోకి సంబంధించిన చికిత్స కోసం సిద్ధార్థ హాస్పటల్‌కు వచ్చిందన్నారు. చేరిన నాటి నుంచి చనిపోయే వరకు అందిన చికిత్స గురించి తెలుసుకున్నామన్నారు. ఈ నెల 6,7 తేదీల్లో రూ.13 లక్షల బిల్లు కట్టించుకొని సుహాసిని మృతదేహాన్ని అప్పగించడంపై కుటుంబ సభ్యుల ఆందోళనలతో మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. వైద్యులు, సిబ్బందిని ఈ ఘటనపై ఆరా తీయగా, అడిగిన ప్రశ్నలకు చెప్పిన సమాధానాలకు పొంతన లేదన్నారు. దీంతో ఆపరేషన్ థియేటర్ సీజ్ చేసి కేస్ షీట్స్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఆమె చనిపోయినట్టు నిర్ధారణ జరిగితే యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం దవాఖానాలో 28 రోగులు ఉన్నారని, తర్వాత వచ్చే కొత్త రోగులను చేర్చుకోవద్దని ఆదేశించామన్నారు.

పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

ఎమ్మెల్యే గాంధీ



పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. మియాపూర్ –బొల్లారం రోడ్డులోని సత్యలక్ష్మి కాలనీ వద్ద పైప్‌లైన్ మరమ్మత్తు పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జలమండలి అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాగునీటి పైప్ లైన్ పాతది కావడంతో ఆకస్మాత్తుగా పగిలిపోయిందని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, డీజీఎం వెంకటేశ్వర్లు, నాయకులు తదితరులున్నారు.

మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ పోలీసులు



వ్యక్తిని అంబులెన్స్ ఎక్కిస్తున్న పోలీసులు

గచ్చిబౌలి: ట్రాఫిక్ పోలీసులు మానవత్వం చాటుకున్నారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధి నానక్‌రాంగూడ ఔటర్‌రింగురోడ్డు నుంచి గచ్చిబౌలి మార్గంలో సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరగడంతో కానిస్టేబుల్ ప్రభు, హోంగార్డ్ శేఖర్ అక్కడి చేరుకున్నారు. అప్పటికే ఓఆర్‌ఆర్‌పై ఓ వ్యక్తి గాయాలపాలై పడి ఉండడాన్ని గమనించారు. వెంటనే సపర్యలు చేసి నీళ్ళు తాగించారు. అనంతరం 108 అంబులెన్స్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. వాహనదారులు కానిస్టేబుల్, హోంగార్డును అభినందించారు.

జీతాలు ఇవ్వాలంటూ ధర్నా

గచ్చిబౌలి: జీతాలు సకాలంలో చెల్లించాలంటూ కొండాపూర్ జిల్లా ఆస్పత్రి కాంట్రాక్ట్ ఉద్యోగులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. జీతాలు రాకపోవడంతో ఇబ్బందులుపడుతున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ అనురాగిని రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఏజెన్సీలు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, రాజు, సిద్ధి రాములు, సుబ్రహ్మణ్యం, మణెమ్మ, అమృత, మహ్మద్ అబేద్, రమ. నవ్య పాల్గొన్నారు.



ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

సీయూఈటీ-పీజీ పరీక్షలను ప్రాదేశిక భాషల్లో నిర్వహించాలి

రాయదుర్గం: విద్య సమానత్వం కోసం కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ ఫర్ పోస్టు గ్రాడ్యుయేట్ (సీయూఈటీ–పీజీ) పరీక్షలను ప్రస్తుత ద్విభాషా విధానమైన ఇంగ్లిష్ ,హిందీకి పరిమితం చేయకుండా ప్రాదేశిక భాషల్లో కూడా నిర్వహించాలని ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు, హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థి జి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా పల్లెల్లో, సామాజికంగా వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులెక్కువగా ప్రాదేశిక భాషల్లోనే విద్యనభ్యసిస్తున్నారని, వారికి పోటీ చేయడం కష్టతరం చేస్తోందన్నారు. సీయూఈటీ–పీజీ పరీక్షల్లో ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యం లేకపోవడం, ప్రభుత్వం ప్రతిపాదించిన సమానమైన విద్యా అవకాశాల లక్ష్యానికి విరుద్ధమన్నారు. ప్రాదేశిక భాషా ఎంపికలను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

సభలను విజయవంతం చేయండి



కరపత్రాన్ని విడుదల చేసిన ఎంసీపీఐయూ నాయకులు

మియాపూర్: మాజీ ఎంసీపీఐయూ పొలిట్‌బ్యూరో సభ్యులు స్వర్గీయ కామ్రేడ్ తాండ్ర కుమార్ వర్ధంతి సందర్భంగా ఫిబ్రవరి 14 నుండి 21 వరకు జరిగే కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ పిలుపునిచ్చారు. మియాపూర్ టేక్ నర్సింహనగర్ కాలనీలో కార్యక్రమాలకు సంబంధించిన కర పత్రాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాండ్ర కుమార్ వర్ధంతి సందర్భంగా ఫిబ్రవరి 14 నుండి 21 వరకు రాష్ట్ర వ్యాప్తంగా భూమి, ఇండ్లు, ఇళ్ల స్థలాలు ప్రభుత్వ విధానాలు– మన కర్తవ్యం అనే అంశంపై సభలు, సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఫిబ్రవరి 14న మియాపూర్ క్రాస్ రోడ్డు వద్దనున్న స్వర్గీయ కామ్రేడ్ తాండ్ర కుమార్ విగ్రహం నుండి టేకు నర్సింహ్మనగర్ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం టేకు నర్సింహ్మనగర్ కాలనీలో స్వర్గీయ తాండ్ర కుమార్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్‌కుమార్, సభ్యులు తాండ్ర కళావతి, కర్ర దానయ్య, ఇస్లావత్ దశరథ్ నాయక్, పల్లె మురళి, తుకారాం నాయక్, భాగ్యమ్మ తదితరులున్నారు.

ప్రజావాణి.. 6 వినతిపత్రాలు



శేరిలింగంపల్లి సర్కిల్‌లో.. డిప్యూటి కమిషనర్ ముకుంద్‌రెడ్డి, ఇతర అధికారులు

చందానగర్ : చందానగర్ సర్కిల్– 21 కార్యాలయంలో సోమవారం ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు వినతిపత్రాలు అందగా మూడు టౌన్‌ప్లానింగ్, మూడు రెవెన్యూ విభాగాలకు సంబంధించినవి కాగా వెంటనే సమస్యలను పరిష్కరించాలని డీసీ మోహన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో డిప్యూటి కమిషనర్ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో ప్రజలు 3 ఫిర్యాదులు అందజేశారు. రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ విభాగాలకు ఒక్కొక్క దరఖాస్తు చొప్పున వచ్చినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటరమణ, ఏఎంసీలు ప్రేమ్‌కుమార్, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, అర్బన్ బయోడైవర్సిటీ సర్కిల్ మేనేజర్ యూసుఫ్, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథుడి రథోత్సవం



రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు



ఆలయంలో రథోత్సవం

రాయదుర్గం: రంగనాథుడి బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధాన ఘట్టం రథోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం రంగనాథ స్వామి ఆలయంలో అభిషేకం, అలంకారం చేశారు. పూలు, పండ్లు, మామిడిఆకులతో రథాన్ని అలంకరించారు. అనంతరం అర్చకుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య రథాన్ని లాగారు. పలువురు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర

పటాన్‌చెరు: మల్లన్నస్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం బచ్చుగూడెం గ్రామంలో సోమవారం నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకటరెడ్డి, అంతిరెడ్డి, బిక్షపతి పాల్గొన్నారు.

ఇక బుకింగ్ రోజే.. ట్యాంకర్



రిజర్వాయర్ వద్ద వాటర్ ట్యాంకర్లను నింపుతున్న దృశ్యం

- వేసవి దృష్ట్యా జలమండలి అధికారుల ముందస్తు కార్యాచరణ
- ట్యాంకర్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాల గుర్తింపు
- ఆరుచోట్ల అదనపు ఫిల్లింగ్ పాయింట్ల ఏర్పాటుకు కసరత్తు

బంజారాహిల్స్: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ఇబ్బందుల్లేకుండా జలమండలి అధికారులు ముందస్తు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఫిబ్రవరిలోనే ఎండలు పెరిగిపోతుండడంతో క్రమంగా భూగర్భజలాలు అడుగంటిపోతూ.. తాగునీటి సరఫరాపై ప్రభావం చూపుతోంది. దీంతో ఎక్కడెక్కడ నీటి సరఫరా డిమాండ్ ఉంది.. ఏ ప్రాంతంలో ట్యాంకర్లు ఎక్కువగా బుక్ చేస్తున్నారు.. అనేదానిపై జలమండలి డివిజన్–6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వేంకటేశ్వర కాలనీ, సోమాజిగూడ, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, అమీర్‌పేట్, ఫతేనగర్, ఎస్సార్‌నగర్ ప్రాంతాల్లోని తాగునీటి రిజర్వాయర్ల పరిధిలో ఇటీవలే క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేశారు. ఎల్లారెడ్డిగూడ, జూబ్లీహిల్స్, ఫతేనగర్, బోరబండ, బంజారాహిల్స్, సోమాజీగూడ, అమీర్‌పేట తదితర ప్రాంతాల్లో ట్యాంకర్ల డిమాండ్‌ను గుర్తించారు. వెంటనే జలమండలి ఉన్నతాధికారులు ఆ ప్రాంతాల జాబితాను స్థానిక అధికారులకు అందించి ఆరు రిజర్వాయర్ల ప్రాంతాల్లో ఆరు అదనపు ఫిల్లింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో బంజారాహిల్స్, తట్టిఖానా, ప్రశాసన్‌నగర్, వెంకటగిరి, సోమాజిగూడ, ఎల్లారెడ్డిగూడ, ఎస్సార్‌నగర్, ఫతేనగర్, బోరబండ తదితర రిజర్వాయర్ల పరిధిలో సెక్షన్ మేనేజర్లు అప్రమత్తమయ్యారు. వాస్తవానికి డివిజన్–6 పరిధిలో 11 చోట్ల రిజర్వాయర్లకు అదనపు ఫిల్లింగ్ పాయింట్లు అవసరమని స్థానిక అధికారులు సూచించారు. అయితే ప్రాధాన్యతా క్రమంలో భారీగా డిమాండ్ ఉన్న ప్రాంతాలను గుర్తించిన ఉన్నతాధికారులు ఆ మేరకు మొదటి దశలో ఆరు రిజర్వాయర్లకు అదనపు ఫిల్లింగ్ పాయింట్లను కేటాయిస్తూ ఆదేశించారు. ఈ వేసవిలో బుక్ చేసిన రోజే వాటర్ ట్యాంకర్‌ను పంపించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రిజర్వాయర్లకు సరిపడా నీరు సరఫరా చేయడం ద్వారా సమస్యను అధిగమించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. జలమండలి డివిజన్–6 పరిధిలో ఉన్న 23 రిజర్వాయర్ల పరిధిలో 90 వేల పైచిలుకు కనెక్షన్లు ఉండగా, ప్రతిరోజూ 40 మిలియన్ గ్యాలన్ల మంచినీటిని సరఫరా చేస్తున్నారు.

దళారులను ఆశ్రయించొద్దు..

వాటర్ ట్యాంకర్ల కోసం ఎవరూ కూడా దళారులను ఆశ్రయించవద్దు. ట్యాంకర్ కావాలంటే 155313 నంబర్‌కు కాల్ చేసి బుక్ చేసుకుంటే అదేరోజే పంపిస్తాం. ఇటీవల ట్యాంకర్ల కోసం దళారులను ఆశ్రయిస్తున్నట్లుగా ఫిర్యాదులు అందాయి. ఈ విషయంలో మేము కూడా వాటర్‌సెక్షన్ పరిధిలో అవగాహన కల్పిస్తున్నాం.

– హరిశంకర్, జీఎం, జలమండలి డివిజన్–6